సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సీజనల్ జ్వరాలపై అవగాహన



మహారాణి వీధిలో సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న జెడీసీ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు మర్రి పాలెం పరిధి మహారాణి వీధిలో శుక్రవారం జోన్–5 మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్లా శ్రీనివాస రావు నేతృత్వంలో 'ఫ్రైడే–డ్రైడే'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ బోడ్డేపల్లి రాము పాల్గొని స్థానికులకు సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్రిజ్‌లు, సిమెంటు కుండీలు, పూల కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని మలేరియా సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో కార్తీక్, జనార్దన్, కిరణ్, మాధవరావు, శివకుమార్, గణేష్‌బాబు, శ్రీను, కనకరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా మార్గానికి మరమ్మతులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శివారు ప్రాంతమైన ములగాడ విలేజ్ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం పూర్తిగా గుంతల మయం అయింది. దీంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన పోర్టు యాజమాన్యం స్థానికుల విజ్ఞప్తి మేరకు మరమ్మతులు చేస్తోంది. గుంతల్లో మట్టి పూడ్చి పనులు చేపడుతున్నారు. అనంతరం బీటీ మార్గం వేస్తారు. శుక్రవారం చేపడుతున్న పనులను గ్రామ పెద్దలు దగ్గరుండి పర్యవేక్షించారు.

విమల విద్యాలయాన్ని ప్రారంభించలేం

- స్పష్టం చేసిన పాఠశాల కరస్పాండెంట్

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయాన్ని నడిపించటానికి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రాతపూర్వకంగా అంగీకారం ఇవ్వకపోవడంతో ఈ ఏడాది పాఠశాలను ప్రారంభించలేక పోతున్నామని కరస్పాండెంట్ పులికాల్ తెలిపారు. పాఠశాల తెరిచే అంశంపై తాము ఆర్‌సీఎం సొసైటీ తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. అయితే ఈనెల 15న కోర్టు ఉత్తర్వులు వస్తాయని ఆశించామన్నారు. న్యాయస్థానం ఈనెల 30కి వాయిదా వేసిందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం హామీ ఇవ్వనందున జిల్లా విద్యాశాఖాధికారి నుంచి గుర్తింపు పత్రం పొందలేక పోయామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలను తెరవలేక పోతున్నామని శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని విద్యా సంవత్సరం కోల్పోకుండా పిల్లల విషయంలో తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విప్ గణబాబు

గోపాలపట్నం: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. 89వార్డులోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం 89, 90, 91, 92 వార్డులకు సంబంధించిన సమస్యలపై అధికారులతో సమీక్షించారు. గోపాలపట్నం తహసీల్దార్ రమేష్, జోనల్ కమిషనర్ హేమావతి, డీఈ వీరయ్య, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి చర్చించారు. మ్యాపింగ్, రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు వంటి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చర్యలు

సీతంపేట: డీఎంహెచ్‌వోడాక్టర్ పి.జగదీశ్వర రావు ఆధ్వర్యంలో జిల్లాలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆశా కార్యకర్తల నుంచి వినతులు తీసుకుని, తమ స్థాయిలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. పనిచేసే చోట ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్న ఉద్దేశంతో ఆశ గ్రీవెన్స్ మీటింగ్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డీపీహెచ్‌ఎన్‌వో ఎం.సత్యవతి, డీసీఎం మణికుమారి పాల్గొన్నారు.



రైల్వే సిబ్బంది క్వార్టర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న కాలనీ వాసులు



గొంతు తడవాలంటే... పాట్లు ఇలా..



రైల్వే ట్రాక్ దాటి వస్తున్న మహిళలు

రైలు పట్టాలు దాటితేనే.. గుక్కెడు నీళ్లు

- రిక్షా కాలనీలో తాగునీటి సమస్య
- కానరాని మౌలిక వసతులు
- బడుగులపై కూటమి నేతల చిన్నచూపు
- కాలనీలో బోర్లు వేయనీయకుండా అడ్డగింత
- వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలో కాలనీల నిర్మాణం

జీవీఎంసీ 52వ వార్డులోని గౌరీనగర్ (రిక్షాకాలనీ) వాసులు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. రోజువారీ అవసరాలకు కూడా నీటి సౌకర్యం లేని పరిస్థితి. మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు ఎన్ఏడీ చుట్టు పక్కల రిక్షా తొక్కుకుంటూ జీవనం సాగించే వారే ఇక్కడ ఉండడంతో దీన్ని రిక్షా కాలనీగా పిలుస్తారు. అంతా రోజువారీ కూలిపనులు చేసుకొని జీవనం సాగించేవారు. ఇలాంటి కాలనీపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేస్తోంది.

– విశాఖ విద్య

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మించి ఇచ్చిన కాలనీ కావడంతో కూటమి ప్రభుత్వం ఇక్కడి ప్రజానీకంపై అక్కసు వెళ్లగక్కుతకోంది. జీవీఎంసీ ద్వారా మౌలిక సౌకర్యాలు కల్పించడానికి వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నిధులు మంజూరు చేయించినా, పనులు కానివ్వకుండా కూటమికి చెందిన వార్డు నాయకుడు అడ్డుపుల్ల వేస్తున్నాడు. దీంతో బడుగు జీవులకు ఇబ్బందులు తప్పడం లేదు.

సమస్యలు పట్టవా..?

కాలనీకి ఆనుకొని(రైల్వే ట్రాక్ వైపు) మురుగు కాలువ ఉంది. ఎన్ఏడీ పరిసర కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు అంతా ఇక్కడ నుంచే దిగువకు వెళ్తుంది. పారిశుధ్య నిర్వహణ బాగాలేదు. దీంతో ఈ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ సమస్య నుంచి గట్టెక్కించడానికి కాంపౌండ్ వాల్ కట్టేందుకు నిధులు కేటాయించినా, కూటమి నేతల కుళ్లు రాజకీయాలతో పనులు ముందుకు సాగడం లేదు. అలాగే కమ్యూనిటీ హాల్ కట్టేందుకు కొంత స్థలం కేటాయించారు. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్‌లోని జగనన్న కాలనీ

రైలు పట్టాలు దాటాల్సిందే ..

కాలనీలో ఉన్న చేతి పంపులు అడుగంటిపోయాయి. రోజు వారీ అవసరాల కోసం మోటార్ ద్వారా నీటిని ట్యాంకుకు ఎక్కించి వాడుకుంటున్నారు. అయితే ట్యాంకు నీటి సామర్థ్యం సరిపోకపోవడంతో కాలనీ వాసులు బిందెడు నీటి కోసం రైల్వే ట్రాక్ దాటి వెళుతున్నారు. రైల్వే సిబ్బంది క్వార్టర్స్‌లో నీటి బిందె పట్టుకొని ట్రాక్ దాటుకొని వచ్చే క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇంతటి ప్రమాదకరమైన పరిస్థితులు ఉన్నప్పటికీ కూటమి నాయకుల మనసు కరగడం లేదు. బడుగు జీవులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు.

పనులు అడ్డుకోవడం సరైంది కాదు



కాలనీలో మా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అనేక సార్లు విన్నవించుకున్నాం. మా ఇబ్బందులను తొలగించేందుకు జియ్యాని శ్రీధర్ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు. కానీ, కాలనీలో జరిగే అభివృద్ధి పనులను కొంతమంది కావాలనే అడ్డుకుంటున్నారు. ఇది ఎంతమాత్రం పద్ధతి కాదు. కూలి పనులు చేసుకునే మాలాంటోళ్లపై రాజకీయాలు చేయడం సరైందికాదు. బోర్లు వెంటనే వేయాలి.

–పి.రమణ, కాలనీ అధ్యక్షుడు

నీటి కోసం ఇబ్బందులు



రోజువారీ పనులు చేసుకొని బతికే మాబోటోళ్లకు ఆ తండ్రీ కొడుకులు అదే వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇళ్లు కట్టించి ఇచ్చారు. కానీ ఇప్పుడేమో చాలా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. తాగునీరు సరిపడా లేవు. బోర్లు వేస్తే వాటిని నిలిపివేశారు. మా ప్రాంతంలో బోర్లు వేయకపోతే ఆందోళన చేస్తాం. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించాలి.

– వెంకటలక్ష్మి

సమస్యలు పట్టించుకోవాలి



ప్రతీ రోజు ఉదయం 8గంటలకు మునిపాలిటీ కుళాయి నీళ్లు వస్తాయి. అప్పుడు పట్టుకుంటేనే ఇంట్లో తాగేందుకు నీరు ఉండేది. పొద్దున్నే పనికిపోయేటోళ్లం. నీళ్ల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. సాయంత్రం పూట కూడా నీరు సరఫరా చేసేలా అధికారులు కరుణించాలి. బోర్లు నిర్మాణం అడ్డుకొని మాకు అన్యాయం చేయవద్దు.

– ఎస్.మణి

మా రోడ్డు బాగుచేయండి.. మహాప్రభో!

ప్లకార్డులతో చిన్నారి విద్యార్థుల నిరసన

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ నుంచి వాయుపుత్ర కాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా గోతులతో నిండి ఉంది. ఈ మార్గాన నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు, వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యపై స్థానిక చిన్నారి విద్యార్థులతో కలిసి సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ నాయకులు శుక్రవారం ఉదయం ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ రోడ్డుపై ప్లకార్డులు పట్టుకుని నిరసనతో కూడిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మల్కాపురం జోన్ కమిటీ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ మాజీ సైనిక కాలనీ, వాయుపుత్ర కాలనీల మీదుగా శాంతిగిరి కాలనీ, ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద గల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయన్నారు. కూటమి అధికారంలోకి వస్తే శిథిలమైన రోడ్లకు మోక్షం కల్పిస్తామని గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన నాయకులు వాగ్దానాలు చేశారని, నేడు అవి ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇక్కడి సర్వీస్ రోడ్లు మొత్తం గోతులమయంగా మారడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురికావడంతోపాటు ప్రమాదాల బారిన పడుతున్నారని, పాలకులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇక్కడి రహదారులకు తక్షణం మరమ్మతులు చేపట్టకుంటే స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిన్నారి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో గోతుల రోడ్డుపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దోమల మందు పిచికారీ



ములగాడ విలేజ్‌లో ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శివారు ప్రాంతాలైన ములగాడ విలేజ్, ఎదురవానిపాలెం గ్రామాల్లో మూడు రోజుల నుంచి విషజ్వరాల పీడితులు అధికం అవుతున్నారు. బాధితులు డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి బారులు తీరుతున్నారు. దీనిపై సాక్షి దిన పత్రికలో శుక్రవారం వణికిస్తున్న విషజ్వరాలు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన మలేరియా విభాగ అధికారులు శుక్రవారం సాయంత్రం ములగాడ, ఎదురవానిపాలెం గ్రామాల్లో ఫాగింగ్ చేయించారు. శానిటరీ సిబ్బంది పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. నివాసాల్లో నీటి నిల్వలు లేకుండా, నీటిపై కప్పులు అమర్చే విధంగా చర్యలు తీసుకున్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు


గోపాలపట్నం: విజువల్ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం గోపాలపట్నం వద్ద సింహాచలం రైల్వే స్టేషన్, కొత్తపాలెం జంక్షన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చి వెళ్లే వారిని గోపాలపట్నం పోలీసులు తనిఖీ చేసి, లగేజీలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ ఎన్.వి.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల్లో భరోసా నింపేందుకు విజువల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 6 నుంచి 9 గంటల వరకు పలు ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టడం వంటివి చేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ధూమపానం చేయడం నేరమని గోపాలపట్నం సీఐ ప్రభాకర్ తెలిపారు. అలా చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బహిరంగంగా ధూమపానం చేసే వారిపై రూ.200 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దుకాణదారులు కూడా 18 ఏళ్ల వయసు కన్న చిన్నవారికి సిగరెట్లు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యాలయాలు, ప్రార్థనా మందిరాల సమీపంలో మద్యం, ధూమపాన పదార్థాలు అమ్మరాదని తెలిపారు. వాటిని విక్రయించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేస్తున్న సీఐ ప్రభాకర్

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కోడిపందాల దిబ్బ ప్రాంతంలో మల్కాపురం మలేరియా విభాగం అధికారుల ఆధ్వర్యంలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా విభాగ హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, మల్కాపురం మలేరియా విభాగాధికారి డి.రవికుమార్‌లు మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తదితర సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంట్లో నీటి నిల్వలు, వ్యర్థాలు ఉంచరాదని, ఇంటి పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. తమ ప్రాంతాల్లో దోమల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాస రావు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



దోమల నిర్మూలనపై స్థానికులకు సూచనలిస్తున్న మలేరియా విభాగాధికారి రవికుమార్

భెల్ కార్మికులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

గాజువాక: భెల్ కార్మికులకు ప్లాంట్ పెర్‌ఫార్మెన్స్ పేమెంట్, స్పెషల్ ఇన్సెంటివ్ కింద రూ.30 వేలు చెల్లించేందుకు నిర్ణయించినట్టు బీహెచ్‌ఈఎల్ విశాఖపట్నం ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు జి.టి.పి.ప్రకాష్, సీతన్న నాయుడు తెలిపారు. భెల్ జాయింట్ కమిటీ ఫెడరేషన్ నాయకులతో ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ ఇన్సెంటివ్ ఈనెల జీతంతో రూ.15వేలు, దీపావళి సమయంలో రూ.15వేలు చెల్లిస్తారన్నారు. కరోనా సమయంలో నిలిపివేసిన లేట్ నైట్ స్నాక్ అలవెన్స్, ఓటీ చెల్లింపులు, భవిష్యత్ ప్లాంట్ పెర్‌ఫార్మెన్స్ చెల్లించడానికి ఒక కొత్త ఫార్ములాను నిర్ణయించడానికి సబ్ కమిటీలను వేసి ఆయా కమిటీల్లో చర్చించిన అనంతరం నిర్ణయించాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, సీఐటీయూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ తోపాటు ఇతర నాయకులకు, భెల్ సీఎండీ సదాశివమూర్తి సమక్షంలో ఈ నిర్ణయం జరిగినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు ఎస్.జగన్నాథరావు, పి.ఆనంద్ కుమార్, కె.నారపరెడ్డి, వారాడ ఆనందరావు, మురళేశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్కాపురం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపురం ప్రాంతానికి చెందిన వెంకటరావు (35)అనే వ్యక్తి మారుతీ సర్కిల్ వద్ద గల వీడీఆర్ గొడౌన్స్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ వ్యక్తి అక్కడే ఉంటుంటాడు. ఇది ఇలా ఉంటే గురువారం రాత్రి వెంకటరావు వీడీఆర్ గొడౌన్స్ వద్ద రోడ్డు దాటు తుండగా ఆ సమయంలో అటువైపు వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో వెంకటరావు తీవ్రంగా గాయపడ్డాడు. అంబులెన్స్ సాయంతో కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

స్మార్టు మీటర్లు వద్దు

మల్కాపురం: కూటమి సర్కారు ఓట్లు వేసిన ప్రజలను వంచన చేస్తుందని, గత ప్రభుత్వ హయాంలో స్మార్టు మీటర్లపై పెద్ద రగడ చేసిన టీడీపీ,జనసేన నాయకులు ఇప్పుడు నోరు ఎందుకు మెదపడం లేదని సీపీఐ నాయకులు గుడాల రాంబాబు,గండి అప్పారావు ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జీవీఎంసీ 59వ వార్డు చైతన్యనగర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడారు. స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పి ప్రజలను మరింత ఇబ్బందులకు గురి చేసేందుకు కూటమి సర్కారుయత్నిస్తుందని మండిపడ్డారు. పేద ప్రజలకు అండగా ఉంటానని,వాగ్దానాలు చేసిన జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ నేడు ఏమయ్యాడో అర్థం కావడం లేదన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని నక్కవానిపాలెం,చైతన్యనగర్‌కాలనీలో కరపత్రాలు పంపిణీ చేశారు.



విద్యుత్ స్మార్టు మీటర్లు వద్దని నినదిస్తున్న సీపీఐ నాయకులు, మహిళలు

ఇంటర్‌నెట్‌తో యువతకు రచనా రంగంలో అవకాశాలు

మల్కాపురం: ఇంటర్‌నెట్ ద్వారా యువత రచనా రంగంలో నిలదొక్కుకోవచ్చని రచయిత కొయిలాడ బాబు అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో శుక్రవారం గరిమ సాంస్కృతిక సంస్థ పురస్కారోత్సవాలు నిర్వహించింది. అతిథిగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌నెట్ వల్ల యువత రచనా నైపుణ్యం పెరుగుతుందన్నారు. వారి రచనలు సత్వరం ప్రచురితమవుతాయని, సరికొత్త రచనలకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ఇంటర్‌నెట్‌లో ఉండే ఈ–పుస్తకాలు, బ్లాగ్‌లు, సోషల్ మీడియా వేదికలు మొదలైన వాటిని గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా గరిమ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు కె.వి.ఎస్.నరసింహం, వినియోగ సమాచారం ప్రతిక సంపాదకుడు హెచ్.ఎస్.రామకృష్ణ, సెయింట్ ఆన్స్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు లక్ష్మీదేవి, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు రచన అంశాలపై ప్రసంగించారు. అనంతరం అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థినులు పాల్గొన్నారు.



అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు, విద్యార్థినులు

కిశోరి వికాసంపై అవగాహన



పోస్టర్లు ప్రదర్శిస్తున్న చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కౌమార బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి తదితర అంశాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం కిశోరి వికాసం పోస్టర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తోపుడు బళ్ల వ్యాపారులకు తోడ్పాటు

విశాఖ విద్య: ఎన్ఏడీ పరిసర ప్రాంతాల్లో తోపుడు బళ్లపై వ్యాపారాలు చేసుకునే వారి సౌకర్యార్థం జేసీఐ వైజాగ్ సభ్యులు వితరణగా ఇచ్చిన గొడుగులను శుక్రవారం మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందజేశారు. వీధి వ్యాపారులకు తోడ్పాటు అందించడం శుభ పరిణామమన్నారు. జేసీఐ సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి సంక్షేమ పథకాలు అందించేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షులు జియ్యాని కావ్య, కార్యవర్గ సభ్యులు మౌనిక, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తోపుడు బండి వ్యాపారికి గొడుగు అందజేస్తున్న జియ్యాని శ్రీధర్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com